నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

మంగళవారం, నవంబరు 26 2024 పేజీలు 8

గుంటూరు పల్నాడు

# రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



- హెరిటేజ్ ప్రాంతాలను గుర్తించి, కాపాడేలా చర్యలు
- పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- టెంపుల్, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి కార్యాచరణ
- సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

**రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ, ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని, రాష్ట్రాన్ని టూరిజం హబ్ గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. ఆలయాలు, పర్యావరణం, సాహస క్రీడలు తదితర అంశాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఏటా పది శాతం అభివృద్ధికి అవకాశం ఉన్న పర్యాటక రంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పటికే పర్యాటక రంగ అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు.**

గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక, సూర్య బ్యూరో

సోమవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో టెంపుల్, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి కార్యాచరణ, పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ఇచ్చిన హామీల అమలుపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్. అండ్ బి., ఐ. అండ్ ఐ. శాఖల మంత్రి బి.సి.జనార్ధన రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గతంలో పాలకులు రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించు కుని ముందుకు తీసుకువెళ్లేవారు. పి.వి. నరసింహారావు దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో యాత్ర బస్సుల పేరిట దివ్య క్షేత్ర దర్శనం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టూరిజం అంటే విదేశాలకు వెళ్లడం అనే పరిస్థితి ఉత్పన్నమయ్యింది. గతంలో ఎకో టూరిజం గురించి

మిగతా 3 లో...

# ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వద్దు..

## • జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి

గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక, సూర్య బ్యూరో

ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి పిజిఆర్ఎస్‌లో అందించిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లిప్తత చూపకుండా వాటిని గుణాత్మకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, డిఆర్ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు, గుంటూరు ఆర్డిఓ కే.శ్రీనివాస రావు ప్రజల నుండి 166 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల

మిగతా 3 లో...



# కుటుంబాన్ని చంపి అనాథనయ్యానని ఏడ్చేరకం జగన్ : చీఫ్ విప్ జీవీ

వినుకొండ, మేజర్ న్యూస్: చేజేతులా కుటుంబాన్ని చంపుకుని జడ్జి ముందు అనాథనయ్యాను కరుణించమని ఏడ్చేరకం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అని ధ్వజమెత్తారు అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు. అయిదేళ్లపాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని విద్యావ్యవస్థతో చెడుగుడు ఆడుకుని ఇప్పుడు మొసలి కన్నీళ్లు కార్చడమే అందుకు నిదర్శనమన్నారు. కేవలం అయిదేళ్లలో రాష్ట్రాన్ని 50 ఏళ్లు వెనక్కి తీసుకుని వెళ్లిన జగన్ అరాచకాలకు



ముందుగా బలైపోయింది విద్యావ్యవస్థనే అని వాపోయారాయన. విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు, పాఠశాల విద్యలో సమస్యలు అంటూ జగన్ రాద్ధాంతం చేస్తున్నారంటూ సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ మేరకు దుయ్య బట్టారు. దిగిపోయే నాటికి ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు రూ. 3,480 కోట్లు పెట్టిన ప్రబుద్ధుడు ఇప్పుడు వాటి పేరు చెప్పి కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మాలని చూడడాన్ని ఏమనాలంటూ నిలదీశారు. వాటితోపాటు పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించి రూ.వెయ్యి కోట్లు, చిన్నారుల చిక్కీలు, కోడిగుడ్లకు కూడా రూ.178 కోట్లు, పిల్లలకు కుట్టుకూలికి ఇవ్వాల్సిన రూ.65కోట్లు కూడా ఇవ్వకుండా పోయింది కాక

మిగతా 3 లో...

# కష్టపడే వారికి తప్పక గుర్తింపు

**- కార్పొరేటర్లు పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ**



**గుంటూరు, మేజర్ న్యూస్ :**
కష్టపడి పనిచేసే వారిని గుర్తించి, పార్టీలో వారికి సముచిత స్థానం కల్పించడంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఎప్పుడూ ముందుంటారని కార్పొరేటర్లు పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ కొనియాడారు. అందుకు మస్తాన్‌వలి నియామకమే తాజా నిదర్శనమని వారు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన షేక్ మస్తాన్‌వలిని సోమవారం వారు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదవులతో పని లేకుండా పార్టీలో నిజాయితీగా పని చేసే షేక్ మస్తాన్‌వలి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, ఆలా కిరణ్ తదితరులు పాల్గొని షేక్ మస్తాన్‌వలికి శుభాకాంక్షలు తెలిపారు.

# సామాజిక సేవలో యువత భాగస్వామ్యం కీలకం

**-ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి**

**గుంటూరు, మేజర్ న్యూస్ :**
పది మందికి సాయం చేసే గుణం పాటిబండ్ల కిరణ్ (ఆలాకిరణ్) సొంతమని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కొనియాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పాటిబండ్ల కిరణ్ (ఆలా) జన్మదినోత్సవ వేడుకలు రెడ్డిపాలెంలోని మాన వతా సేవా సమితిలో నిరాడంబరంగా జరిగాయి. సోమ వారం రత్నపురి కాలనీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వయో వృద్ధుల సమక్షంలో ఆలా కిరణ్ చేత బర్త్ డే కేక్ కట్ చేయించారు. అనంతరం ఆశ్రమంలోని వయోవృద్ధులకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ప్రవేశించిన ఆలా కిరణ్ అటు రాజకీయాలు ఇటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ఆపన్నులకు అండగా నిలవడంలో ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. సామాజిక సేవా



కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, నూనె ఉమామహేశ్వరరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, 50వ వార్డు ప్రెసిడెంట్ రాజేష్, భాగ్యమ్మ, కొండమ్మ, త్రివేణి, చీరాల శివకుమార్, వాసిమళ్ళ విజయ్, కాటూరి విజయ్, అరవ విజయ్, కనపాల సందీప్, కమలికంటి మల్లిక్, విక్టర్, నూనె వెంకట్, దుర్గ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా మందిరంలో రుద్రాభిషేక పూజలు



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్:**
పట్టణంలోని నరసరావుపేట రోడ్డు సాయినగర్‌లో గల శ్రీ షిరిడి సాయి బాబా మందిరం ప్రాంగణంలోని భవాని శంకర స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమం జరిగింది. కార్తీక 4వ సోమవారం మరియు కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా ఈ ప్రత్యేక పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ రామడుగు రామకృష్ణ శాస్త్రి, ఋగ్వేద ఘనపాఠి పవన్ కుమార్ శాస్త్రి చే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ చల్లా విజయ్ కుమార్ వారి ధర్మ పత్ని విజయలక్ష్మి ప్రత్యేకంగా మహాశివునికి పంచామృత అభిషేకాలు చేసారు. ధూపదీపనైవేద్యాలుతో విశిష్టఅలంకరణ తో మహారుద్రం, శివనామ అష్టోత్తర పూజ, పంచహారతులతో స్వామి వారికి పూజా కార్యక్రమ నిర్వహించారు. భక్తులు ఈ అభిషేకం పూజ కార్యక్రమంలో పాల్గొని గోత్ర నామాలతో పూజ జరిపించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ చల్లా విజయకుమార్ మాట్లాడుతూ మంగళవారం కూడా పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలని వారు కోరారు.

# మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాల్సిన బాధ్యత కాటన్ కార్పొరేషన్ దే..

**మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు**



యడ్లపాడు, మేజర్ న్యూస్: ప్రత్తి కొనుగోలువిషయంలో కేంద్రంపై, సీసీఐపై తెచ్చిన ఒత్తిడి ఫలించిందని మాజీ మంత్రి, చిలకలూరిపేట శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుపేర్కొన్నారు. మండలం లోని తిమ్మాపురం వద్ద గల తిరుమల కాటన్ మిల్లు లో వున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఈరోజు సందర్శించి పత్తి కొనుగోళ్ల తీరుపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పత్తి రైతుల ఇబ్బందులపై తాను శాసనసభలో, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రంతోనూ మాట్లాడామని ప్రత్తిపాటి తెలిపారు . రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కూడా సీఎం



చంద్రబాబు ద్వారా కేంద్ర జౌళి శాఖ మంత్రికి లేఖ రాశారని తెలిపారు. తమ పోరాటం ఫలితంగా కేంద్రం రైతుల శ్రేయస్సు గురించి ఆలోచించి కొంతమేరకు నిబంధనలు సడలించి 15 శాతం వరకూ తేమ ఉన్నప్పటికీ కొనుగోలుకు అంగీకరించిందని ప్రత్తిపాటి తెలిపారు. ఇప్పటికే కాటన్ మిల్లులన్నీ దెబ్బతిన్నాయని, సరైన మద్దతు ధర ఇవ్వకుండా రైతులను నష్టానికి గురిచేస్తే రైతులు పత్తి పంట వేయటం మానేస్తారని ప్రత్తిపాటి హెచ్చరించారు. కాబట్టి కేంద్రం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి రైతులను ఆదుకోవాలన్నారు. ఎటువంటి షరతులు లేకుండా చివరి క్వింటాలు వరకూ పత్తి కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా తాను అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా రైతులకు ప్రత్తిపాటి పుల్లారావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో పుల్లారావు వెంట పార్టీ శ్రేణులు,రైతు సహోదరులు పాల్గొన్నారు.

# ఆశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ

**చిలకలూరిపేట రూరల్, మేజర్ న్యూస్ :**
కార్తీకమాసం సందర్భంగా కోటప్పకొండ దగ్గర గల ధనమ్మ మాతాజీ ఆశ్రమానికి స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు మరియు ఫ్లడ్ లైట్స్ పంపిణీ జరిగినది ..కార్యక్రమం అనంతరం ఆశ్రమంలోని ఉసిరి తోటలో సేవా సమితి సభ్యులు వనభోజనాలు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో వలివేటి వెంకట సత్యనారాయణ ,కాపు వెంకటరావు, కనమర్లపూడి రామబ్రహ్మం, బీకాం శ్రీనివాస్ సింగ్, కే. ప్రసాదరావు, గుడివాడ రామారావు , వలేటి మధుబాబు, పొత్తూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడాము. దానికి సంబంధించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చర్యలు కూడా ప్రారంభించాము.

### ఎక్కడ... ఏమున్నాయో ప్రజలకు తెలియాలి

పర్యాటక అభివృద్ధికి మనకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. కర్నూలు జిల్లా ఆదోని, దొండపాడు, ఉమ్మడి కడప జిల్లా సిద్ధవటం లాంటి ప్రాంతాల్లో విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్క్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. మన రాష్ట్ర విద్యార్థులను విహార యాత్రకు తీసుకెళ్లాలంటే పాఠశాల యాజమాన్యాలు పక్క రాష్ట్రాలైనా కర్ణాటక, కేరళ ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. అక్కడ విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్క్ లు ఏర్పాటు చేశారు. అలాంటి థీమ్ పార్క్ లు మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. వాటిపై దృష్టి పెట్టడం వల్ల చాలా మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు విద్యార్థులకు వినోదం, ఉత్సాహంతో పాటు గొప్ప అనుభూతిని అందించవచ్చు. నంద్యాలలో ఏనుగుల క్యాంపులు ఉన్నాయి. గండికోట, హార్స్ లీ హిల్స్ ల్లో అద్భుతమైన కొండలు ఉన్నాయి. మన వారసత్వ సంపదకు తగిన ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. తిరుపతి దగ్గర గుడిమల్లం ఆలయం, కాకినాడ సమీపంలో ఉన్న కోరింగ మడ అడవులు, వన్యప్రాణి అభయారణ్యాలు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి. అయితే ఎక్కడ ఏమున్నాయి అన్న సమాచారం ప్రజలకు అందుబాటులో లేదు. రాష్ట్రంలో పర్యటక రంగం అభివృద్ధి చెందాలి అంటే అసలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టూరిజం స్పాట్స్ ఎక్కడ ఏమున్నాయి అనే విషయం ప్రజలకు తెలియాలి. అలా తెలియాలి అంటే ప్రణాళికాబద్ధంగా ప్రచారం కల్పించాలి.



న్యూజిలాండ్, ఉక్రెయిన్ లాంటి దేశాలు చలనచిత్ర మాధ్యమాన్ని అందుకు ఎంచుకుంటున్నాయి. సినిమాల ద్వారా పర్యటక ప్రాంతాలకు తేలికగా ప్రచారం కల్పించవచ్చు. ఒక సినిమాలో ఒక స్పాట్ ను ప్రమోట్ చేస్తే అదే కరపత్రంగా మారుతుంది. స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించడం ద్వారా అది సాధ్యపడుతుంది.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సందర్భంగా లాతూర్ ప్రాంతం నుంచి తిరుపతి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైలు కావాలి అని అడిగారు. ఆ ప్రాంతం నుంచి నిత్యం 1000 మంది వరకు శ్రీవారి దర్శనానికి వస్తారు. వారి కోసం రైల్వే శాఖ సమన్వయంతో యాత్ర బస్సుల మాదిరి సీజన్లవారీగా ప్రత్యేక రైళ్లు వేయించాలి. తద్వారా విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించవచ్చు. కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక వెళ్ళిన సందర్భంగా ఆ రాష్ట్ర అటవీశాఖ మంత్రి శ్రీశైలంకు కాలినడకన వచ్చే భక్తుల ప్రస్తావన తెచ్చారు. వారికి గతంలో సౌకర్యాలు ఉండేవి. ప్రస్తుతం వాటిని తీసేశారు. ముఖ్యమంత్రి తో సమావేశం సందర్భంగా అటవీశాఖ అధికారులు మా దృష్టికి తీసుకువచ్చిన టూరిజం పోలీసింగ్ అంశం కూడా చర్చకు వచ్చింది.

### దేవాలయాల పవిత్రత కాపాడటం మన బాధ్యత

మహారాష్ట్రలో పాండురంగ యాత్రను అక్కడ ప్రజలు చాలా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. క్రీస్తు పుట్టిన జెరూసలేం వెళ్లినా... వాటికన్ సిటీని సందర్శించినా చాలా క్రమశిక్షణతో ... ఎక్కడా అరుపులు, కేకలు లేకుండా భక్తిభావంతో ప్రజలు మెలుగుతారు. మన దగ్గర దేవాలయాలు అంటే పిక్నిక్ స్పాట్స్ లా మారిపోయాయి. ఆలయాల పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా మన సంస్కృతి విశిష్టతను అందరికీ తెలియచేయాలి. పల్లెల అభివృద్ధికి గ్రామ సభలు నిర్వహించినట్లు... ఆలయాల పవిత్రతను కాపాడటానికి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం వంటివి చేయాలి. ఆలయ ప్రాంగణాల్లో తిరిగేటప్పుడు ఎలా క్రమశిక్షణతో మెలగాలి, డ్రెస్ కోడ్ వంటి వాటిపై అవగాహన కల్పించాలి. వీటితోపాటు దేశం గర్వించదగ్గ నాయకుల ఇళ్లు, వారు నడయాడిన ప్రాంతాలు, ఫ్రీడమ్, సోషల్ మూమెంట్స్ కు సంబంధించిన ప్రాంతాలను గుర్తించి వాటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి హెరిటేజ్ ప్రాంతాలను గత పాలకులు తమ స్వార్ధానికి తవ్వుకుంటూ వెళ్లిపోయారు. అటువంటి వాటిని గుర్తించి, కాపాడుకోవడం చాలా అవసరం. అన్నింటికంటే ముఖ్యంగా పర్యాటకుల భద్రత చాలా అవసరము"ని అన్నారు.

---

కుటుంబాన్ని చంపి అనాథనయ్యానని

# ఏడ్చేరకం జగన్

## - చీఫ్ విప్ జీవీ

(మొదటి పేజీ తరువాయి)



ఇప్పుడు మాట్లాడ్డానికి సిగ్గుశరం ఉండాలన్నారు చీఫ్ విప్ జీవీ. చేసిన పనులన్నీ చేసి ఇప్పుడొచ్చి ఫేజుబకాయిలంటున్న జగన్ దొంగనాటకాల్ని ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. అమ్మఒడి ఆగిపోయిందంటూ తప్పుడు ప్రచారం చే యాలని చూస్తున్న దుర్మార్గుడికి ఇటీవలే బడ్జెట్లో తల్లికివందనం పథకానికి రూ.6,487 కోట్లు కేటాయించింది కనిపించలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని రూ. పది లక్షల కోట్లు పైగా అప్పుల్లో పెట్టి పోయిన జగన్ నిర్వాకాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అసలు, వడ్డీల రూపంలో రూ. 53,253.30 కోట్లు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ల పేరిట చేసిన అప్పుల కుప్పలు దీనికి అదనం అని, వాటి వాయిదాలు, వడ్డీలు కూడా కలిపితే ఏడాదికి 70 వేల కోట్లకు పైగా భారం పడుతుందన్నారు. ఇలా వైసీపీ ప్రభుత్వం పెట్టిపోయిన బకాయిలు గుదిబండలా మారినా వాటిని చెల్లిస్తూనే కొత్త వాటికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతిఒక్కరు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలను అభినందిస్తుంటే జగన్ మాత్రమే కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని దూర్పారాబట్టారు.

---

# ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వద్దు..

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి అర్జీని నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన అర్జీ తిరిగి రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్తితే సంబంధిత అధికారికి మెమో జారీ చేసి సంజాయిషి కోరడం జరుగుతుందన్నారు. వారి సంజాయిషి సహేతుకంగా లేని పక్షంలో వారిపై డిసిప్లినరి చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తు లను జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ సమీక్షించడం జరిగింది. ఫిర్యాదుల పరిష్కారాన్ని నిర్ణీత గడువు లోపు ఎట్టి పరిస్థితుల్లోను పరిష్కరించాల్సి వుందన్నారు. కోర్టు కేసులకు సంబంధించి సమీక్షిస్తూ గౌరవ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు పరచాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా కేసు కంటెమ్ట్ వరకు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి కౌంటరు దాఖలు చేయని వారు రేపు సాయంత్రం లోపు డ్రాఫ్టు కౌంటరు సమర్పించాలన్నారు.

### దివ్యాంగుల వారి వద్దకే వెళ్ళి పిటిషన్లను స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ :-

తమ సమస్యల పరిష్కారానికి పిటిషన్లు అందించేందుకు కలక్టరేట్ కు చేరుకున్న దివ్యాంగులు శాసన పాములు, పులిపాక శివ కుమార్ నుండి స్వీకరించి సంబంధిత అధికారులకు పంపి పరిష్కార చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారికి జిల్లా కలెక్టర్ భరోసా కల్పించారు. అనంతరం ఫిర్యాదులను ఆన్లైన్ లో నమోదు చేస్తున్న ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సర్వీసు రిక్వెస్టులకు సంబంధించి నమోదు చేస్తున్న వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. సర్వీసు రిక్వెస్టులు తక్కువగా వున్నాయని సిబ్బంది జిల్లా కలెక్టర్కు ఈ సందర్భంగా వివరించారు. ప్రజల సౌకర్యార్థం ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ తో పాటు సర్వీసు రిక్వెస్టుల నమోదుకు వారానికొక సచివాలయం నుండి ఇక్కడ నిర్వహించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ సచివాలయ సిబ్బందికి తెలిపారు. సర్వీసు రిక్వెస్టులు స్వీకరించి వాటిని ఆన్లైన్ లో సజావుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వారికి సూచించారు.

### ప్రోటోకాల్ తప్పక పాటించాలి:

ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, శిలాఫలకాల పై తమ పేర్లు లేవని, సరైన సమాచారం కూడా అందడం లేదని సభ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు.

ప్రభుత్వం ప్రోటోకాల్ కు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసి వుందని ఆ మేరకు అధికారులు తప్పని సరిగా ప్రోటోకాల్ పాటించాల్సిందే అని జిల్లా కలెక్టరు అధికారు లకు సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ శేషశ్రీ, డ్వామా పిడి శంకర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, మత్స్య శాఖ ఏడి గాలి దేముడు, డి ఎస్ ఓ కోమలి పద్మ, డిఇఓ రేణుక, డిసిఓ విరాచారి, డిడి సోషల్ వెల్ఫేర్ మధుసూదన్ రావు, తది తర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ భారత్‌లో ఎన్.యస్.యస్. వాలెంటర్స్ పాత్ర కీలకం



గుంటూరు సిటి, మేజర్ న్యూస్: స్వచ్ఛ భారత్ కార్యక్రమం లో సామాజిక సేవా భావాలు కలిగిన జాతీయ సేవా పథకం వాలెంటర్స్ కీలక పాత్ర వహించాలని మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని టిజెపిఎస్ కళాశాల విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు గుంటూరు నగరంలో కొన్ని ముఖ్యమైన(మార్కెట్, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ప్రభుత్వ వైద్య శాల) వివిధ ప్రదేశాలలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించినారు. అదేవిధంగా, కళాశాల, పాఠశాల స్థాయిలో పరిసరాల అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, అర్యోగమైన సమాజం కోసం సైకిల్ ర్యాలీ, అందరూ సమానం అనే భావన కలిగించడానికి ఆల్ యూనిటీ వంటి కార్యక్రమాలు కమీషనర్ ఆధ్వర్యంలో విజవంతం గా జరిపారు. ఈ స్వచ్ఛత కార్యక్రమంలో ఉత్సాహం గా పాల్గొన్న టి.జె. పి.యస్. కళాశాల జాతీయ సేవా పథకం వాలెంటర్స్‌కి సోమ వారం కమిషనర్ ప్రశంసా పత్రాలు అందించడం జరిగింది. సామాజిక సేవ చేస్తున్న కళాశాల వాలెంటర్స్ ని కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్ కె. వి. బ్రహ్మం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ వి. దివ్యతేజోమూర్తి, అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ జె. వి. సుధీర్‌కుమార్, కె. నారా యణ ( ఐ. టి. సి. యం. యస్ కె. ఫినిష్ సొసైటీ) ఎన్.యస్.యస్. విద్యార్థులు పాల్గొన్నారు.

# శివాలయంలో భక్తుల సందడి

♦ వివిధ సేవా రుసుము ద్వారా వచ్చిన ఆదాయం రూ.10 లక్షలు

♦ ఆలయ ఉప కమిషనర్ కెబి. శ్రీనివాసరావు



పెదకాకాని, మేజర్ న్యూస్:- పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానములో కార్తీకమాస చివరి సోమవారము వేకువజామున భక్తులు యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించి అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీ స్వామి వారిని దర్శించుకొని, ఆలయ ప్రాంగణములో భక్తులు దేవస్థానము వారు ఏర్పాటు చేసిన ప్రదేశము నందు కార్తీక దీపారాధనలు చేసుకున్నట్లు ఆలయ ఉప కమిషనర్ కె బి. శ్రీనివాసరావు తెలిపారు..దేవస్థానమునకు విచ్చేసిన భక్తులు ప్రత్యేకముగా ఏర్పాటు చేసిన క్యూ లైనులు ద్వారా తర్వితగతిన దర్శనము, శ్రీ స్వామి వారికి అభిషేకములు జరిపించుకున్నట్లు తెలిపారు. క్యూలైనుల నందు భక్తులకు ఉచితముగా పాలు, మజ్జిగ, మంచినీళ్ళ బాటిల్స్ అందించారు. శ్రీ స్వామి వారి అన్నప్రసాదము భక్తులు స్వీకరించినారు. ఆలయ ప్రాంగణములో మేళతాళముల నడుమ ప్రభలతో శ్రీ స్వామి వారి మొక్కులు తీర్చుకున్నారు. కళ్యాణ కట్ట నందు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీ స్వామి వారి పొంగళ్లు నివేదను సమర్పించుకున్నారు. వివిధ సేవా రుసుములు, ప్రసాదము విక్రయము, అన్నప్రసాద విరాళములు, వస్త్రములు బహిరంగ వేలము ద్వారా రూ. 10,10,000/-లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. భక్తులకు ఏ విధమ్మెన అసౌకర్యము కలుగకుండ పెదకాకాని పోలీసు వారు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రత్యేక సిబ్బందిని నియమించి నట్లు తెలిపారు. అగ్నిమాపకశాఖ, పంచాయితీశాఖ, వైద్యశాఖ తదితర శాఖల సహాకారము అందజేసినట్లు తెలిపారు. కార్తీకమాసము పర్వదినము సందర్భముగా దేవస్థానములో మంగళవారము ఉదయం శ్రీ మల్లేశ్వరస్వామి వారికి విశేషమ్మెన లక్షబిల్వార్చన కార్యక్రమము జరుగును. కావున భక్తులు దేవస్థానమునకు విచ్చేసి శ్రీ స్వామి వారిని అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకొని శ్రీస్వామి వారి లక్షబిల్వార్చన పూజ కార్యక్రమములో పాల్గొన్ని అనుగ్రహపాత్రులు కావలం నదిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# 6 నెలల్లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేస్తాం

ఏపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు



మంగళగిరి మేజర్ న్యూస్ : మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలను ఏపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. వైద్యశాలలో అందుతున్న సేవలు, మందుల గురించి వైద్యశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి సంబంధించిన ప్లాన్ ను అధికారులు చిల్లపల్లి శ్రీనివాసరావుకు వివరించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ మంగళగిరి ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రి 100 పడకల ఆస్పత్రి గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా ప్రభుత్వం వచ్చిన



వెంటనే 100 పడకల ఆస్పత్రి తీసుకురావడంతో పాటు 52 కోట్లు నిధులు మంజూరు చేయించారు.

మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిని రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతాం అన్నారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలనేది మా లక్ష్యం అని తెలిపారు. శంకుస్థాపన చేసిన తరువాత 6 నెల్లలో 100 పడకల ఆస్పత్రి ప్రజలకు అందు బాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావర ణంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం జరుగుతుంది అని అన్నారు. త్వరలోనే మంత్రి నారా లోకేష్ మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలించి శంకు స్థాపన చేస్తారని తెలిపారు.సుమారు 3 ఎకరాలు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి భూమిని గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు కొంత అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. అలానే అధునాతన టెక్నాలజీతో మరియు ఇన్ఫ్రాస్ట్రక్చర్ తో నూతన ఆసుపత్రి అందుబాటులోకి తీసుకువస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## శనీశ్వరన్ ఆలయ అర్చక బృందానికి

# ఘన స్వాగతం



యడ్లపాడు, మేజర్ న్యూస్: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని కారైకల్ జిల్లా తిరునల్లార్ గ్రామంలో శనీశ్వరన్ ఆలయంగా ప్రసిద్ధి చెందినగా దర్భణేశ్వరస్వామి దేవ స్థానం ప్రధాన అర్చకులు రాజాస్వామినాథ గురుకుల్ బృందానికి మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి అతిథ్యమిచ్చారు .వివరాలలోకి వెళ్తే గుంటూరు జిల్లాలో కృష్ణమందిరం నిర్మాణ ప్రక్రియలో భాగంగా వెళ్ళా యడ్లపాడు వాస్తవ్యులు, పుడమిబిల్డర్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసి స్థానికంగా పూజలు నిర్వహించి గ్రామస్తులకు ఆశీర్వచ నాలు ఇచ్చారు. నియోజకవర్గంలో అనేక పురాతన ఆలయాలు ఉన్నాయని, అవన్నీ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలని, ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక అభివృద్ధి జరిగి ప్రజలకు సంతోషాన్ని ప్రసాదించాలని కోరారు. సురేష్‌బాబు, అరుణకుమారి దంపతులు రాజా స్వామినాథ గురుకుల్, మహాలింగ గురుకుల్ లను సత్కరించారు. కార్యక్రమంలో యడ్ల పాడు శివాలయం అభివృద్ధి కమిటీ శ్రీనివాస రావు, కృష్ణమూర్తి, రామ సుబ్బారావు, గ్రామ పెద్దలు ముత్తవరపు రామారావు, రవీంద్ర, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# జగజ్జీవన్ రామ్ చైర్‌ను సందర్శించిన లిడ్ కాప్ చైర్మన్



ఏఎన్‌యు/పెదకాకాని, మేజర్ న్యూస్:- ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బాబు జగజీవన్ రామ్ చైర్ ను సోమవారం ఏపీ లిడ్ కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జగజీవన్ రామ్ చైర్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ చైర్ నుంచి శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం చైర్ ప్రొఫెసర్ ఆచార్య పి.రత్నాకర్‌తో కలిసి వీసీ ప్రొ.కె.గంగాధరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మాదిగలకు గుర్తింపు ఇవ్వాలని, ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సందర్భంలో డాక్టర్ గంగాధర్, డాక్టర్ ఇశ్రాయేల్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ రవిబాబు, పరిశోధకులు పిడతల అభిషేక్, సునీల్, శాస్త్రి, కుటుంబరావు, రోహిణి, సాంసన్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్టినాడు సిమెంట్స్ బ్లాస్టింగ్ వల్ల ఇబ్బంది పడుతున్నాం

**పెదగార్లపాడు గ్రామస్తులు తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేత**



దాచేపల్లి, మేజర్ న్యూస్: దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలో ఉన్న చెట్టినాడు సిమెంట్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం పరిమితిని మించి బ్లాస్టింగ్ జరుపుతుందని గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం గ్రీవెన్స్ లో తాసిల్దార్ కుటుంబరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పరిమితిని మించి బ్లాస్ట్ చేస్తున్నారని దానివల్ల మా గృహాలు బీటలు వారి నెరలిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల చర్మ వ్యాధుల సమస్యలు వస్తున్నాయి అని దానివల్ల ఒంటి మీద దద్దుర్లు పలు సమస్యలు కు దారితీస్తుందని నీరు కూడా కలుషితమైపోయి ఒక రకమైన వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మా సమస్యల పరిష్కరించి మాకు న్యాయం చేయాలని తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.

## క్రీస్తు లూథరన్ దేవాలయం క్రిస్మస్ స్టార్ ఏర్పాటు



మాచవరం, మేజర్ న్యూస్: మండల కేంద్రమైన మాచవరం మేజర్ గ్రామపంచాయతీ నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీలోని క్రీస్తు లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో క్రిస్మస్ పండగను పురస్కరించుకొని క్రిస్మస్ స్టార్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక సంఘ కాపరి పాస్టర్ రెవరెండ్ వై. ప్రభాక రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 25వ తేదీ నుండి డిసెంబర్ 25 తేదీ వరకు ఉదయకాల ఆరాధనలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. మండలంలోని మాచవరం జీసస్ గాస్పల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తెలుగు బాప్టిస్ట్ చర్చి, పలు లుదరన్ దేవాల యాల్లోచర్చిల పైన, గృహాల పైన క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని పలు దేవాలయాల దైవ సేవకులు అన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడదాం

## ● ప్రొ. ఎన్ రంగయ్య, న్యాయ శాస్త్ర నిపుణులు

గుంటూరు, మేజర్ న్యూస్ : ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా పేరుగాంచిన భారత రాజ్యాంగ స్ఫూర్తిని, నైతికతను నిలబెట్టాల్సిన అవశ్యకత ప్రధాన రాజకీయ పార్టీలు, మేధావులు, కోట్లాది ప్రజలపై ఉందని న్యాయ శాస్త్ర నిపుణులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్టార్ ప్రొ. ఎన్. రంగయ్య పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన గుంటూరులోని జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ప్రధాన వక్తగా పాల్గొని ప్రొ.ఎన్. రంగయ్య ప్రసంగించారు. 1946 లో 399 మందితో ఏర్పడిన రాజ్యాంగ పరిషత్ దేశ విభజన కారణంగా 285 మంది రాజ్యాంగ పరిషత్ లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి ,రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు శ్రమించి వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, అత్యున్నత లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని తెలిపారు. రాజ్యాంగంలో 395 నిబంధనలు, 8 షెడ్యూలు, 22 భాగాలతో ప్రారంభమై నేడు 106 రాజ్యాంగ సవరణలతో మరింత పరిపుష్ట చేసుకున్నామన్నారు. భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ గాను, మరో నాలుగు కమిటీలలో సభ్యునిగా కృషిచేసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. భారత రాజ్యాంగ మౌళిక స్వరూపానికి భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించిన సందర్భాలలో సుప్రీంకోర్టు, హైకోర్టులు జోక్యం చేసుకోవడాన్ని సమర్థించారు. రాజ్యాంగ ఆదేశక సూత్రాలలో పొందుపరిచిన ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తగ్గించడానికి బదులు గత 75 సంవత్సరాలలో ఆర్థిక అసమానతలు పెరిగాయని, దేశ ప్రజలలో ఒక్క శాతం చేతిలో 50 శాతం సంపద కేంద్రీకృతమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించటం, దళిత, గిరిజన, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక సదుపాయాలు




కల్పిస్తూ డా.బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచడం అభినందనీయమన్నారు. రాజ్యాంగ నైతికతను పాటిస్తూ రాజకీయవేత్తలు, అధికార యంత్రాంగం, న్యాయాధికారులు రోల్ మోడల్‌గా ఉంటేనే భారతదేశం వికసించగలదన్నారు. శాసనమండలి సభ్యులు కె. యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీలకు పదవీ విరమణ కాగానే రాజకీయ పదవులు కడబెట్టే సాంప్రదాయం మంచిది కాదని, ఇది న్యాయవ్యవస్థ పై నమ్మకం సన్నగిల్లేలా చేస్తుందన్నారు. కొలీజియం పద్ధతిలో జడ్జీల నియమకాన్ని సమీక్షించుకోవాలని, జమినీ ఎన్నికలు సమైక్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఇటీవల కాలంలో ప్రభుత్వ అధినేతలు రాజ్యాంగబద్ధ పాలనకు బదులు రాజకీయ పాలన వైపు మొగ్గు చూపుతున్నారని, వ్యవస్థలను ధ్వంసం చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థపై శాసన వ్యవస్థ పెత్తనం చేస్తూ అధికార విభజనకు విఘాతం కలిగి స్తున్నారన్నారు. ఈ చర్చా గోష్టిలో నేస్తం సహాయ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, జనచైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి. శేషుబాబు, రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, మానవత డైరెక్టర్ చావ శివాజీ, సామాజిక వేత్త బత్తుల కోటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

# నేటి విద్యార్థులే రేపటి శాస్త్ర వేత్తలు

**సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రసన్న వెంకటేష్.**

**దార్శనికతతో విద్యార్థులలోని నైపుణ్యాన్ని గుర్తించాలి.**

**పల్నాడు కలెక్టర్ పి అరుణ్ బాబు.**

**సంబరంగా బాలుర గురుకులంలో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన**

సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ : మేధాశక్తికి పేదరికం అడ్డు కాదని, నేటి విద్యార్థులే రేపటి భావి శాస్త్రవేత్తలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల నందు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక, చిత్ర కళా ప్రదర్శన జరిగింది.

ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయకర్త పద్మజ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రసన్నతో పాటు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ చాలామంది మేధావులు గురుకుల విద్యాలయాల్లోని అభ్యసించి ఐఏఎస్ లుగా, ఐపీఎస్ లు గా ఎదిగారన్నారు.

ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు విదర్థులలోని నైపుణ్య తని గుర్తించి వారిని ప్రోత్సహిస్తే భావితరా లకు మంచి శాస్త్రవేత్తలను అందించిన వారవుతారన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ బాబు మాట్లాడుతూ దార్శినికతతో విద్యార్థు ల్లోని నైపుణ్యతను గుర్తించి వారికి ఆత్మ స్థైర్యాన్ని కల్పించడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. పల్నాడు జిల్లాలోని అన్ని పాఠశాల విద్యార్థులకు విద్య, వసతి, వికాసమునకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటుని అందిస్తుందన్నారు.

కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ ఎం సంజీవరావు, డీఈవో చంద్రకళ, తెదేపా యువ నాయకులు కన్నా నాగరాజు, సర్పంచ్ రమాదేవి, ప్రిన్సిపాల్ జాన్సన్,బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 190 గురుకుల విద్యాల యాల 60మంది విద్యార్థులు, 40గ్రూపులు, ఆయా ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ, జోనల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. సభ అనంతరం ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రసన్న వెంకటేష్.. జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు ప్రదర్శనను సందర్శించారు.





# సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్న భర్తపై చర్యలు తీసుకోవాలి




❍ తనఖా భూమిని స్వాధీనం చేసుకున్నారు, న్యాయం చేయండి.

❍ మంత్రి నారా లోకేష్ 46వ రోజు ప్రజాదర్బార్‌కు విన్నపాల వెల్లువ

❍ సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

మంగళగిరి, మేజర్ న్యూస్: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్ కు విన్నపాలు వెల్లువెత్తాయి. నెల రోజులకు పైగా విరామం తర్వాత ఉండవల్లిలోని నివాసంలో 46వ రోజు సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. దీంతో ఉదయం నుంచే ప్రజలు బారులు తీరారు. మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి సమస్యలను ఆయా శాఖలకు పంపి పరిష్కారం కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పలు విజ్ఞప్తులపై అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

కుటుంబ అవసరాల కోసం తనఖా పెట్టిన తమ 3.10




ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని అన్యాయం చేశారని తాడేపల్లికి చెందిన గరుకు కృష్ణకుమారి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. స్త్రీధనం కింద నా తల్లిదండ్రులు చిలువూరులోని 3.10 ఎకరాల భూమిని రాసిచ్చారు. ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుల నిమిత్తం సదరు భూమిని ఇప్పటం గ్రామానికి చెందిన మున్నంగి మధుసూదన్ రెడ్డి వద్ద తాకట్టుపెట్టి రుణం తీసుకున్నాం. కరోనా సమయంలో తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించలేకపోయాం. ఇప్పుడు వడ్డీతో సహా రుణం చెల్లిస్తామని, తమ భూమి పత్రాలు అప్పగించాలని కోరగా.. భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని మున్నంగి మధుసూదన్ రెడ్డి బెదిరిస్తున్నారని మంత్రి వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. భూమి విలువ పెరగడంతో అన్యాక్రాం తం చేశారని వాపోయారు. విచా రించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్న తమకు ఇంటి స్థలం మంజూరు చేసి ఆదుకోవా లని మంగళగిరికి చెందిన షేక్ రోజా విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఎన్నిమార్లు కోరినా పట్టించుకోలేదన్నారు.

కూటమి ప్రభుత్వంలో సాయం చేయాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. తీసుకున్న అప్పునకు పొలం రాసివ్వాలంటూ పెదవడ్లపూడికి చెందిన అన్నే కృష్ణహర్ష, అన్నే కృష్ణ వినోద్ వైసీపీ నేత దేవినేని అవినాష్ పేరు చెప్పి బెదిరిస్తున్నారని చినవడ్లపూడికి చెందిన వెనిగళ్ల వెంకట శివరావు ఫిర్యాదు చేశారు. అక్రమ కేసులతో వేధిస్తుండటంతో మానసిన వేదన అనుభవిస్తున్నామని, విచా రించి తగిన న్యాయం చేయా లని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఉన్నత చదువులు చదివిన తమ పిల్లలకు ఉద్యోక అవకాశం కల్పించాలని తాడేపల్లికి చెందిన బెజ్జం రామ కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. దివ్యాంగుడినైన తాను కుటుంబ పోషణ కోసం ఏదైనా చిన్న వ్యాపారం చేసుకునేందుకు ఆర్థిక సాయం చేయాలని యర్రబాలెంకు చెందిన మంద్ర నాగేశ్వరరావు కోరారు. పరిశీలించి తగిన సాయం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

### రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు

తమ వద్ద తీసుకున్న రుణం చెల్లించకుండా చంపుతామని బెదిరిస్తున్నారంటూ విజయవాడ కానూరుకు చెందిన ఆధ్యాత్మ భట్టరు మాధవి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. 2016 ఏడాదిలో పెద్దముత్తేవి గ్రామంలో శ్రీకృష్ణాశ్రమం నిర్వాహకుడు ఎమ్.వి.ఎల్.ఎన్ సీతారాం, వారి కుమారుడు వాసుదేవ కృష్ణ చరణ్ మావద్ద రూ.78 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇప్పటివరకు పూర్తి రుణం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విచారించి తగిన న్యాయం చేయడంతో పాటు ప్రాణరక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం అబ్బరాజు పాలెంలో వారసత్వంగా సంక్రమించిన తమ భూమిని ఇతరుల పేరుతో రాజధాని అమరావతికి భూసమీకరణ కింద ఇచ్చారని, విచారించి తగిన న్యాయం చేయాలని జమ్ముల శైలజ, వీరమాచినేని సుజన విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అయిన తన భర్త గత ప్రభుత్వ అండతో టీడీపీ నేతలపై ఇష్టానుసారంగా పోస్టులు పెట్టి దుర్భాషలాడారని, ప్రశ్నించిన తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ ఏలూరు జిల్లా శ్రీరామవరానికి చెందిన కామిరెడ్డి జయశ్రీ ఫిర్యాదు చేశారు. వైసీపీ అండదండలతో తన భర్త కామిరెడ్డి వెంకట నర్సింహారావు కూటమి ప్రభుత్వంపైనా, టీడీపీ నేతలపైనా సోషల్ మీడియాలో నిత్యం అసభ్యపదజాలంతో ధూషణలకు దిగుతున్నారు. టీడీపీకి మద్దతుగా నిలిచినందుకు తనను వేధింపులకు గురిచేస్తున్నాడని, విచారించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో తన 0.92 ఎకరాలకు పట్టాదారు పాస్ బుక్ మంజూరు చేయాలని గరిమెళ్ల వెంకటరత్నం విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడినైన తాను అధికారుల తప్పిదంతో పాస్ బుక్ కోసం గత పదేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మీ-సేవ ఆపరేటర్లను తగిన విధంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మీ-సేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. వాట్సాప్ సేవల్లో మీ-సేవ ఆపరేటర్లకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. విజయవాడలో నోట్ బుక్స్ తయారీ పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోందని, ఈ పరిశ్రమపై ఆధారపడ్డ పదివేల కుటుంబాలను తగిన విధంగా ఆదుకోవాలని విజయవాడ బుక్ బైండింగ్ లేబర్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# నేడు మాచవరంలో ఆధార్ క్యాంప్



మాచవరం, మేజర్ న్యూస్: మండల కేంద్రమైన మాచవరం మేజర్ గ్రామ పంచాయతీలోని సచివాలయంలో మంగళవారం ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే శ్రీనివాసరావు అన్నారు.పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, గ్రామంలోని ప్రజలు ఆధార క్యాంపుకు హాజరై తమ ఆధార్ కార్డులు సమస్యలు పరిష్కరించుకోవచ్చునని ఆయన తెలిపారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సచివాలయంలో జరిగే ఆధర్ క్యాంపును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## గుంటూరులో తీరనున్న వీధి కుక్కల బెడద : ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, మేజర్ న్యూస్:గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళా మాధవి అసెంబ్లీ సాక్షిగా చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం స్పందించింది. వీధి కుక్కల సమస్యపై అసెంబ్లీలో మాధవి గారు గళ మెత్తిన సంగతి అందరికీ తెలిసిందే... ఈ నేపథ్యంలో కుక్కల బెడదను నివారించటంపై ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది.రాష్ట్రవ్యాప్తంగా వీధి కుక్కలకు గర్భధారణ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు జారీచేసింది. గుంటూరు నగర పాలక సంస్థ యంత్రాంగం కూడా తమ పనిని ప్రారంభించేసింది.

# భక్త జనసంద్రంగా మారిన శివాలయాలు

మాచవరం, మేజర్ న్యూస్: మాచవరంమండలంలో వివిధ గ్రామాల్లో కార్తీక చివరి సోమవారం సందర్భంగా శివాలయాలల్లో మాచవరం పిన్నెల్లి క్రొత్తపాలెం మోర్జంపాడు వేమవరం చెన్నాయపాలెం శివాలయాల్లో తెల్లవారుజామున నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకంగా పూజలు చేసారు. పరమశివుడు ప్రత్యేక అలంకరణల్లో భక్తులు దర్శణనముకు బారులు తీరారు పరమశివుడు కి మహిళలు దీపారాధన చేసారు అలయ అర్చక స్వామి స్వామివారికి మహా న్యాస పూర్వక రుద్ర అభిషేకం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు బ్రహ్మశ్రీ జానపాటి సీతా



రామశర్మ కార్తీక సోమవారం విశిష్టత గురించి భక్తులకు తెలియజేస్తూ చతుర్దశి తిధికి అధిపతి కేతువు మోక్షకారకుడైన కేతువు ఆధీనములో ఉండటం వల్ల ప్రతీ మాసంలో వచ్చే కృష్ణ పక్ష చతుర్దశి రోజు మాసశివరాత్రి జరుపుకోవటం శివారాధన వంటివి చేయడం వల్ల ఈశ్వరుణి యొక్క అనుగ్రహము చేత ఆరోగ్య సిద్ది కలిగి అనారోగ్య సమస్యలు తొలగుతాయి అన్ని భక్తులకు సీతారామశర్మ వివరించారు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

## నగర కమిషనర్ ఆదేశం

గుంటూరు, మేజర్ న్యూస్ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నేరుగా పరిశీలించిన తర్వాతనే బిల్లుల చెల్లింపుకు ప్రాసెస్ చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ సంగడిగుంట, శారదా కాలనీల్లో సిసి రోడ్ల ప్యాచ్ వర్క్ లు, నూతన డ్రైన్లను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు అక్కడే ఉండి పనులను పరిశీలించాలన్నారు. పనులను ప్రత్యక్ష పరిశీలన చేసిన అనంతరం బిల్లుల చెల్లింపుకు ప్రాసెస్ చేస్తామని తెలిపారు. చేపట్టిన పనులు నిర్దేశిత గడువుకు ముందే డ్యామేజి జరిగితే సంబంధిత కాంట్రాక్టర్, పర్యవేక్షణ చేసిన ఇంజినీరింగ్ అధికారులు భాధ్యత వహించాలని స్పష్టం చేశారు. శారదా కాలనీలో పెండింగ్‌లో ఉన్నరోడ్ నిర్మాణ పనులను గమనించి, సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు వెంటనే ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే సంజీవయ్య నగర్ రైల్వే గేటు నుండి నెహ్రు నగర్ గేటు వరకు రోడ్, డ్రైన్ ఆక్రమణల వలన ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, డిశంబర్ 2 నుండి ఆక్రమణలు తొలగింపుకు యాక్షన్ ప్లాని సిద్దం చేయాలని, ముందుగా వారికి నోటీసులు ఇవ్వాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు.

అనంతరం చౌడవరంలోని సిఆర్ కాలనీని పరిశీలించి, శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలనిలో పారిశుద్యం, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల గూర్చి స్థానికులను అడిగి తెలుసుకొని, కాలనీలో మౌలిక వసతుల ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, ఏసిపి వెంకటేశ్వర్లు, డిఈఈ కళ్యాణరావు, ఆర్.ఓ.లు రవి కిరణ్ రెడ్డి, సాదిక్ భాష, ఏఎంహెచ్ఓ రాంబాబు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సర్దుబాటు ఛార్జీల పేరుతో విధ్యుత్ ఛార్జీల పెంపును విరమించుకోవాలి.

## - వామపక్ష పార్టీలు



గుంటూరు, మేజర్ న్యూస్ :

సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపున త్రిప్పి కొట్టాలని సిపియం, సిపిఐ, సిపిఐ (ఎం.ఎల్), న్యూడెమోక్రసీ, ప్రజాపోరు తదితర పార్టీలు ప్రజలకి పిలుపు నిచ్చాయి. నేడు 2/7 బ్రాడిపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో వామపక్షపార్టీల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన 5నెలల్లోనే 17898కోట్లు రూ?లు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు తెరలేపింది. గత వై.సి.పి ప్రభుత్వం 5 సంరాల కాలంలో 32వేల కోట్లు విద్యుత్ భారాలు మోపగా, తెలుగుదేశం ప్రభుత్వం ఐదు నెలల్లోనే 17,898 కోట్ల భారాలు మోపుతుంది. 2022-23, 2023-24 సంవత్సరాలలో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలు మోపడం అన్యాయమన్నారు. 15 నెల పాటు యూనిట్‌కి 1.27రూ?ల చొప్పున 6072 కోట్లు ఇప్పటికే భారాలు వేశారని, మరో మారు 11వేల కోట్ల భారాలు వేయాలని విద్యుత్ శాఖ ప్రజల అభిప్రాయాల కోసం చర్చకు పెట్టిందన్నారు. విద్యుత్ కొనగోళ్ళ అమ్మకాలలో తేడాలు వస్తే ఆ సమస్యను పరిష్కరించాల్సింది ఆయా ప్రభుత్వాలు తప్ప, ప్రజలపై భారాలు మోపడం ఏమిటన్నారు. విద్యుత్ ఉత్పత్తి పంపిణీ బాధ్యత రాష్ట్రాల పరిధిలోనిది కాని కేంద్రంలో బి.జె.పి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఉత్పత్తి పంపిణీ కేంద్రం పరిధిలోకి తీసుకుని రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ బిల్లులు తెచ్చి ప్రైవేటు కార్పోరేట్ సంస్థలకు విద్యుత్ ఉత్పత్తి చేసే హక్కులని కల్పిస్తుంది. మరోవైపు అదాని కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు స్మార్ట్ మీటర్లు బిగించి ప్రీపెయిడ్ మీటర్లను బిగిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు చిన్న చిన్న వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. క్రమేణా ఇళ్ళకు కూడా బిగిస్తారని అర్థమవుతుంది. ఈ నేపధ్యంలో ఉచిత విద్యుత్ రైతులకి ఇచ్చే ఉచిత విద్యుత్‌కు ప్రమాదం ఏర్పడే స్థితి కనిపిస్తుంది. మరోవైపు సౌరవిద్యుత్ అమ్మకాలలో అదాని కంపెనీలు, అధికారులకు ప్రజా ప్రతినిధులకు వేలకోట్లు రూపాయాల అంచాలు సమర్పించినట్లు అమెరికా కోర్టులో కేసు వేయడం చూశాము. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అదానిని అరెస్టు చేయాలని, అదాని కంపెనీతో కుదుర్చుకున్న వ్యాపార ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. ఒక వైపు నిత్యజీవితావసర సరుకులు పెట్రోలు, డీజిల్ వంట గ్యాస్ ధరలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో వైపు విద్యుత్ భారాలు మోపడం అన్యాయం ప్రజలు దీనిని ప్రతిఘటించాలని దశల వారీగా ఆందోళనకు పూనుకోవాలని వామపక్ష పార్టీలు వివిధ ప్రజాసంఘాలు కోరు తున్నాము.

ఈ సమావేశంలో సిపియం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, సిపిఐ (ఎం.ఎల్) నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వి.నరసింహారావు, ప్రజాపోరు నాయకులు కొటేశ్వర రావు, వివిధ ప్రజాసంఘాల నాయ కులు వై.నేతాజి, అరుణ్, ఈమని అప్పారావు, ఎమ్.ఎ. చిస్టీ, కె.అజయ్ కుమార్, బైరగాని శ్రీనివాసరావు, ఎల్.అరుణ, వై.కృష్ణకాంత్, ముసలయ్య, సమీర్, శశీ, కె.నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ వి ఆర్ జె సిలో స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:**

గుంటూరు నగర శివారు చౌడవరం ఆర్.వి.ఆర్ , జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా జరిపారు.ప్రతి రంగంలో మహిళలు అగ్ర స్థానంలో సేవలందిస్తున్నారని, స్త్రీల పై వివక్ష విడనాడి పురుషునితో సమానంగా సముచిత స్థానం కల్పించినప్పుడే ఆర్ధిక ప్రగతి సాధ్యమవుతుందని ఆర్.వి.ఆర్ , జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీని నిర్వహించారు. మహిళా భద్రత, రక్షణకు ప్రభుత్వాలు అనేక కఠిన చట్టాలు తీసుకొచ్చాయని, వీటి పై ప్రతిఒక్కరికి అవగాహనను కల్పించాలని, కళాశాల సెక్రటరీ %d% కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ,ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్,డి డైరెక్టర్ డా: కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాసరావు, కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డా.జి.సుధా వాణి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సబ్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు




మాచవరం, మేజర్ న్యూస్ :మాచవరం జిల్లా పరిషత్ హై స్కూల్ 9 ,10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ ఒకేషనల్ కార్యక్రమాలలో భాగంగా సోమవారం మాచవరంలోని విద్యుత్ సబ్ స్టేషన ,గ్రామ సచివాల యాన్ని సందర్శించారు ఈ సందర్భంగా ఎల్ ఐ విజయ్ కుమార్ విద్యార్థులకు కరెంటు ఉత్పత్తి విద్యుత్ సరఫరా పనిచేసే విధానంపై విద్యార్థులకు వివరించారు అలాగే సచివాలయం కార్యదర్శి కోటేశ్వరరావు సచివాలయాల వ్యవస్థ పనితీరును విద్యార్థులకు వివరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు కాకరపర్తి సురేష్ హిమశ్రీ మనోహర్ మల్లికార్జునరావు భాస్కర్ ఆదినారాయణ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

## శ్రీనునాయక్‌కు లీడర్షిప్ అవార్డు

### - ఈ అవార్డు గిరిజన జాతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాం ఎల్ హెచ్ పి ఎస్ చంద్ర నాయక్



గుంటూరు మేజర్ న్యూస్ : న్యూఢిల్లీ పీహెచ్ డి భవనంలో భారతదేశ ప్రభుత్వం కేంద్ర ట్రైబల్ వెల్ఫేర్ సెంట్రల్ మినిస్టర్ " జుయల్ ఓరం చేతుల మీదగా గ్రేస్ సెక్యూరిటీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి శ్రీను నాయక్ కు సెక్యూరిటీ లీడర్షిప్ ఎంటర్ పెన్యూర్ షిప్ ఇన్ బెస్ట్ సెక్యూరిటీ 2024 అవార్డును అందుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని, ఈ అవార్డు గిరిజన జాతికి వచ్చినట్లుగా భావిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులు సభావతు తావులల్ నాయక్ , రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు దేవ సోత్ చంద్ర నాయక్, గుంటూరు రూరల్ మండలం అధ్యక్షులు నేణావతు దేవా నాయక్, గుంటూరు నగర అధ్యక్షులు బాణావతి విక్రమ్ నాయక్ లు పేర్కొన్నారు. ఇటువంటి గుర్తింపులు మరి ఎంతోమంది గిరిజన బిడ్డలకు అందాలని తమ భావిస్తున్నామని, గిరిజన బిడ్డల పోరాటపటిమను, వెనుకపాటు తనాన్ని అర్థం చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన బిడ్డలకు మరింత ప్రోత్సాహకాలు అందించాలని వారి విజ్ఞప్తి చేశారు.

## కార్మికులకు అందాల్సిన పరిహారం అందించాలి

గుంటూరు, మేజర్ న్యూస్ : కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగరపాలక సంస్థ తరుపున అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ పులి శ్రీనివా సులు తెలిపారు. ఇటీవల మర ణించిన ఇంజినీరింగ్ విభాగ ఔట్సోర్సింగ్ కార్మికులు షేక్ ఉమర్ కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్‌ను సోమ వారం కమిషనర్ తమ చాంబర్ లో అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇటీవల ఇంజినీరింగ్ విభాగం ఎల్ఎల్ఆర్‌లో ఆప్కాస్ విధానంలో విధులు నిర్వహించే షేక్ ఉమర్ మృతి చెందారని, వారి కుటుంబ సభ్యులు షేక్ ముంతాజ్ బేగంకు ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చులు రూ.15 వేల చెక్ లని అందించామని తెలిపారు. అలాగే పిఎఫ్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు.

## దమ్మాలపాడులో తెదేపా సభ్యత్వ నమోదు


ముప్పాళ్ల, మేజర్ న్యూస్ :మండలం పరిధిలో ని ధమ్మాలపాడు గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యకరామాన్ని గుంటూరు నగర మాజీ మేయర్, నియోజకవర్గ యువ నాయకులు కన్నా నాగరాజు ప్రారంభించారు.తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తలకు రూ.100తో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్య సహాయం అందుతుందన్నారు..

# నరసింహారావు ప్రమాణ స్వీకారోత్సవం

## - మంత్రి టీ.జీ భరత్



మాచవరం, మేజర్ న్యూస్ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షులుగా మాచవరం మేజర్ గ్రామపంచాయ తికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, హాఫ్ అరె వైశ్య నాయకులు ఆర్యవైశ్య నాయకులు మాచవరం గ్రామానికి చెందిన చిట్టిప్రోలు నరసింహారావు ఆది వారం సాయంత్రం ప్రమాణస్వీకారోత్సవం వైభవంగా జరిగింది. అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం జరిగింది.



ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి టీ.జే భరత్ హాజరై ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. అనంతరం మంత్రి టీ.జే భరత్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడు చిట్టిప్రోలు నరసింహారావు దుశ్శాలవాలతో,పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షులుగా ఎంపీ చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. నాకు ఈ పదవ బాధ్యతతో కూడుకున్నదని, అంకితభావంతో పనిచేస్తానని ఆయన అన్నారు. అనంతరం మాచవరం మండల మాచవరం గ్రామ ఆర్యవైశ్యులు నరసింహారావును ఘనంగా దుశ్శాలవాలతో,పూలమాలతో సన్మానించారు.

## ఎయిమ్స్‌ను సందర్శించిన బీజేపీ నాయకులు

మంగళగిరి మేజర్ న్యూస్ : రాష్ట్ర బీజేపీ నాయకులు మంత్రి మధుకర్, బిజెపి స్టేట్ మీడియా ఇంచార్జ్ పాతూరు నాగభూషణం సోమవారం మంగళగిరి ఎయిమ్స్‌ను సందర్శించారు. అక్కడి సదుపాయాలు రోగు లకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎయిమ్స్‌లో తమకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందు తున్నాయని, టెస్టుల దగ్గరి నుంచి శస్త్రచికిత్సల వరకూ అన్నీ బాగున్నాయని చికిత్స తీసుకుంటున్న వారు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణలో ఎక్కడ లోపం లేకుండా చూసుకుంటున్నారని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిష్ఠాత్మక ఆసుపత్రి మన రాష్ట్రంలో ఉండటం మన అదృష్టం అని పలువురు అభిప్రాయపడ్డారు.

## గుంటూరులో నిరంతరంగా జాబ్ మేళాలు

### - ఎమ్మెల్యే గల్లా మాధవి



గుంటూరు, మేజర్ న్యూస్ : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిరుద్యోగ యువత అందరికి ఉద్యోగాలు లభించే వరకు నిరంతరంగా జాబ్ మేళాలు నిర్వహిస్తూనే ఉంటామని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నిర్వహిం చిన ఈ జాబ్ మేళాకు హెచ్ ఆర్ అండ్ కో తరపున 5 కంపెనీల ప్రతినిధులు వచ్చారు. సుమారు 50 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకొని ఇంటర్వ్యూ కు హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూ లో సుమారు 30 మంది సెలెక్ట్ అయ్యారని, వారందికి ఈ రోజే ఆఫర్ లెటర్ ఇస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా, నియోజకవర్గంలో ప్రతి డివిజన్ వారీగా నిరుద్యోగులను గుర్తించి, వారి వివరాల్ని ఆన్లైన్ లో రిజిస్టర్ చేయించి ప్రతి 15 రోజులకి ఒకసారి జాబ్ మేళా ను నిర్వహిస్తున్నామని, దీని కోసం తన కార్యాలయంలో ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గల్లా మాధవి హామినిచ్చారు. అదేవిధంగా గడిచిన 5 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, గత పాలకులు రాష్ట్రానికి కంపెనీలు తీసుకొని రాకుండా నిరుద్యోగానికి కారకులు అయ్యారని, దీని వలన నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. చంద్రబాబునాయుడు దార్శనికతతో యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు.

## ఆవులు, ఎద్దులను యజమానులే సంరక్షించుకోవాలి

గుంటూరు, మేజర్ న్యూస్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై సంచరించే ఆవులు, ఎద్దులు, గేదెలను సంబంధిత యజమానులు స్వంత ఆవరణలోనే పెంచు కోవాలని, అలా కాకుండా రోడ్లమీదకు వదిలితే వాటిని జిఎంసి ప్రజారోగ్య సిబ్బంది బంధించి గోశాలకు తరలి స్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమ వారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో విచ్చలవిడిగా రోడ్ల మీదకు ఆవులను, ఇతర పశువులను వదిలి వాహనాల రాకపోకలకు ఆటంకంగా, ప్రమాదాలకు కారణంగా ఉంటున్నారన్నారు. రోడ్ల మీదకు వచ్చే పశు వులను ప్రజారోగ్య సిబ్బంది బంధించి వెంగళాయపాలెంలోని జిఎంసి గోశాలకు తరలించడం జరుగుతుందన్నారు. గోశాలలోని పశువులను యజమానులకు ఇచ్చేందుకు ఒక్కో పశువుకి తొలుత రూ.1000 అపరాధ రుసుం, అలాగే గోశాలకు తరలించిన నాటి నుండి రోజుకి రూ.300 చెల్లించాలని, అది కూడా గోశాలకు తరలించిన 10 రోజులలోపు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. యజమానులు తీసుకెళ్లని వాటిని ఆంధ్రప్రదేశ్ నగరపాలక సంస్థ చట్టం 1955 సెక్షన్ 510 ప్రకారం గోశాలకు తరలించిన 10 రోజుల గడువులోపు యజమానులు స్పందించకుంటే యజమానులు ఎవ్వరూ లేరని భావించి, వాటిని వేలం నిర్వహిస్తామన్నారు.